వేసవిలో విజ్ఞాన వినోదం

ఏడాదంతా చదువులు, పరీక్షల్లో నిమగ్నమైన విద్యార్థులు వేసవి సెలవులనగానే ఎగిరి గంతేస్తారు. ఆటలు, వినోదానికే మొత్తం సమయం కేటాయిస్తారు. అయితే వేసవిలో వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేలా ఏర్పాటు చేసినవే వేసవి విజ్ఞాన శిబిరాలు. డిజిటల్ యుగంలో పుస్తక పఠనానికి దూరమైన పిల్లలకు వాటిని అలవాటు చేసేందుకు, గ్రంథాలయాల్లో లభ్యమయ్యే అపార విజ్ఞాన సంపదను వారికి పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాలు ఏప్రిల్ 28 నుంచి ప్రారంభమయ్యాయి.



విద్యార్థుల్లో నూతనోత్సాహం

సెలవులు సద్వినియోగం



ఆనందపురంలోని శాఖా గ్రంథాలయం వద్ద చిన్నారులు

తగరపువలస: పరీక్షల అనంతరం విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరం పేరుతో పౌర గ్రంథాలయాల శాఖ 40 రోజుల క్యాంపులు నిర్వహిస్తోంది. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరాల్లో చిన్నారులతో పాటు యువత, పెద్దలకు భాగస్వామ్యం కల్పిస్తోంది.

అందుబాటులో 5471 పుస్తకాలు

ఆనందపురం శాఖా గ్రంథాలయంలో 5471 పుస్తకాలను అందుబాటులో ఉంచింది. ఇందులో వార్తాపత్రికలు, మాస పత్రికలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, హాస్య కథలు, బీర్బల్, తెనాలి చమత్కారాలు, పేదరాశి పెద్దమ్మ, మర్యాద రామన్న, పరమానందయ్య శిష్యుల కథలు, మత గ్రంథాలు, చరిత్ర, మహనీయుల జీవిత చరిత్రలు, నవలలు, తత్వ గ్రంథాలు వంటివి ఉన్నాయి. ఈ గ్రంథాలయంలో 1189 మందికి సభ్యత్వం కలిగినా నిత్యం 20 మందికి మించి సందర్శించడం లేదు. గ్రామంతో పాటు అంటుబాటులో మ్యాపింగ్ చేయబడిన 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బంధువులను ఈ వేసవి సెలవుల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు గ్రంథాలయానికి రప్పించేందుకు ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కథలతో స్ఫూర్తి, విలువలు

కథలు స్ఫూర్తినివ్వడంతో పాటు విలువలను నేర్పిస్తాయి. చిన్నతనంలో విన్న కథలు వారిని వివేకవంతులుగా మారుస్తాయి. ముఖ్యంగా పదేళ్లలోపు పిల్లల్ని ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకోవచ్చు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వ్యామోహం, అర్థం పర్థం లేని టీవీ సీరియళ్లు, వాట్సాప్, ఫేస్‌బుక్, వీడియో గేమ్‌లు, అరచేతిలో ఇంటర్నెట్ వంటి సాధనాలు మనుషులు దగ్గరగా ఉన్నా మనసులను దూరం చేశాయి. ఈ వేసవి సెలవులను చిన్నారులు వరంగా మార్చుకుని, మెదళ్లకు పదును పెట్టి కళాత్మకంగా మారడానికి వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయి. అలనాటి ఆటపాటలు, కథలు చెప్పే తాతయ్య, నాన్నమ్మ, అమ్మమ్మలకు దగ్గర చేస్తాయి. ఒత్తిడి పెంచే చదువులు, మార్కులే పరమావధి అయిన ఈ రోజుల్లో కథల పుస్తకాలు స్ఫూర్తి నింపుతాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు సైతం ధ్రువీకరిస్తున్నారు. చిన్నారుల మనసులలో కల్మషాలను దూరం చేయడానికి నీతి కథలు పని చేస్తాయంటున్నారు.

నైపుణ్య వృద్ధి.. సృజనాత్మక శక్తి

విద్యార్థుల్లో నేర్చుకోవడం, మాట్లాడటం, చదవడం, రాయడం (ఎల్ఎస్ఆర్‌డబ్ల్యూ) వంటి ప్రాథమిక నైపుణ్యాలతో పాటు సృజనాత్మకతను పెంపొందించే అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. కథలు వినిపించడం ద్వారా శ్రవణం, పుస్తకాలు చదివించడం ద్వారా పఠనం, కథలు చెప్పడం ద్వారా మాట్లాడటం.. జ్ఞాపకశక్తి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. సాహిత్య అభిలాష కలిగిన వారితో పుస్తకాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటు వారి సమగ్రాభివృద్ధికి బాటలు వేసే వివిధ అంశాలపై దృష్టి సారించారు. కళలు, క్రీడల్లో ఆసక్తి కలిగించేలా డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, బొమ్మల తయారీ, చెస్, క్యారమ్స్, క్విజ్, జనరల్ నాలెడ్జ్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన వినోదానికి చోటు



సెల్‌ఫోన్లు, టీవీ ప్రోగ్రాం ద్వారా చిన్నారుల భవిష్యత్తు నాశనమైపోతుంది. పూర్వంలా రాజకుమారుడు, ఒంటి కన్ను రాక్షసుడు, ఊరి చివర మర్రిచెట్టుపై దెయ్యాలు, సప్త సముద్రాల అవతల మర్రిచెట్టు తొర్రలోని పక్షిలో రాక్షసుని ప్రాణం, రాజ కుమారులను తినేసిన అడవి పంది వంటి కథలు వినిపించడం ద్వారా ఆరోగ్యకరమైన వినోదం అందుతుంది. **–ఉంగరాల లక్ష్మి, పాఠకురాలు**



పాఠకులకు కథలు వినిపిస్తున్న గ్రంథాలయాధికారి అప్పారావు

స్వేచ్ఛ ఇవ్వాలి, స్ఫూర్తి నింపాలి



ఈ నలభై రోజులే చిన్నారులు మనకి దొరుకుతారు. అందుచేత వారిని పోటీ పరీక్షలు, కంప్యూటర్ క్లాసులు అని విసిగించకుండా ఆటలు, పాటలపై వారికి స్వేచ్ఛ ఇవ్వాలి. వీలైతే దైవభక్తి, శీల నిర్మాణం, ప్రతిజ్ఞాపాలన, దేశభక్తుల చరిత్రలు, పరోపకారం, దానగుణం వంటివి చారిత్రాత్మక ఘట్టాల ద్వారా వివరించాలి. **– రిక్క మురళి, పోస్టల్ ఉద్యోగి**

రోజూ రావాలని ఉంది



సెలవుల్లో గ్రంథాలయానికి వస్తున్నా. ఇక్కడ చెబుతున్న కథలు బాగుంటున్నాయి. మేము సొంతంగా కొన్ని పుస్తకాలు తీసి కథలు చదువుకుంటున్నాం. ప్రతిరోజూ రావాలని ఉంది. **–కోరాడ నిఖిత, 4వ తరగతి**

ఎన్నో నేర్చుకుంటున్నాం



మా ఊరి గ్రంథాలయంలో కథలు, క్విజ్, చదరంగం, డ్రాయింగ్ నేర్పిస్తున్నారు. బొమ్మల తయారీ నేర్చుకుంటున్నాం. ఎండ బారిన పడకుండా నీడలో ఉండి అన్నీ నేర్చుకుంటున్నాం. **–ఎం.దుర్గాప్రసాద్, 5వ తరగతి**

పాత కథలు బాగున్నాయి



ఇప్పుడు వస్తున్న సినిమాల కంటే పాతకాలం నాటి రాజుల కథలే బాగున్నాయి. మాకు కూడా అలాంటి సాహసాలు చేయాలన్న కోరిక కలుగుతుంది. ఈ కథల్లో నీతి తెలుసుకుంటున్నాం. **–మీసాల దేవయాని, 4వ తరగతి**

రోజూ పుస్తకాలు, పేపర్లు చదువుతున్నా



సెలవులు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకునేందుకు రోజూ గ్రంథాలయానికి వస్తాను. పాఠశాలలు తెరచినా ఈ అలవాటు మానను. నిత్యం పుస్తకాలు, దినపత్రికలు చదివితే ప్రపంచం తెలుస్తుంది. **–ఎం.నాగలక్ష్మి, 7వ తరగతి**

ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి



వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ఎక్కువ మంది విద్యార్థినీ విద్యార్థులను గ్రంథాలయానికి పంపించి లక్ష్యం నెరవేరేలా చూడాలి. అంగన్‌వాడీ, సచివాలయం, పాఠకుల సాయంతో ఈ శిబిరాన్ని 40 రోజుల పాటు విజయవంతంగా నిర్వహిస్తాం. **– బి.వి.ఎస్.అప్పారావు, గ్రంథాలయాధికారి, ఆనందపురం**



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పుస్తకాలు

క్లుప్తంగా

గత సంఘటనల నుంచి పాఠాలు నేర్వని చంద్రబాబు

- గోదావరి, తిరుమల, సింహాచలం ఘటనలన్నీ ప్రభుత్వ వైఫల్యాలే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: గతంలో గోదావరి పుష్కరాలు, ఇటీవల తిరుమల టిక్కెట్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటల కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా చంద్రబాబు ప్రభుత్వం పాఠాలు నేర్వడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. సింహాచలం చందనోత్సవంలో కూడా నిర్లక్ష్య వైఖరి కనపరచినట్టు అర్థం అవుతోందని పేర్కొన్నారు. బుధవారం ఆయన సంగివలసలో మాట్లాడారు. చందనోత్సవానికి లక్షలాదిమంది భక్తులు వస్తారని తెలిసినా, నాసిరకం గోడను మొక్కుబడిగా నిర్మించడం దారుణమన్నారు. చందనోత్సవం రోజు ప్రణాళిక, పద్ధతి లేకుండా.. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా అధికారులు, మంత్రులు అలక్ష్యం వహించి ఏడుగురి మృతికి, పదుల సంఖ్యలో భక్తులు గాయపడటానికి కారణమయ్యారన్నారు. గోదావరి పుష్కరాల సమయంలో 29 మంది, తిరుమల తొక్కిసలాటలో ఏడుగురు, ఇప్పుడు సింహాచలంలో ఏడుగురు చనిపోయిన సంఘటనలు ప్రభుత్వ వైఫల్యాలేనన్నారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం.. క్షతగాత్రులకు పరిహారం, మెరుగైన వైద్యం కల్పించాలన్నారు.

సింహాద్రినాథుడిగా బబ్బేలమ్మ



చందన మూర్తిగా బబ్బేలమ్మ

పీఎంపాలెం: అక్షయ తృతీయ వేళ కారుషెడ్ వద్ద కొలువై ఉన్న బబ్బేలమ్మ సింహాద్రినాథుడిగా దర్శనమిచ్చారు. అప్పన్న చందనోత్సవం సందర్భంగా అర్చకుడు పొందూరు కిరణ్ కుమార్ శర్మ 15 కిలోల చందనంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అప్పన్న రూపంలో ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నృసింహుని సన్నిధిలో చిన్నశ్రీను



స్వామివారిని దర్శించుకుంటున్న చిన్న శ్రీను

భీమునిపట్నం: అక్షయ తృతీయ సందర్భంగా భీమిలిలోని నృసింహస్వామి ఆలయాన్ని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను), తన కుమార్తె సిరి సహస్రతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మెట్ల మార్గం వద్ద నాలుగు వార్డుల నాయకులు, మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయం వద్దకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు, దర్శనం తరువాత అందరితో కొద్దిసేపు మాట్లాడి, తిరిగి వెళ్లారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కార్పొరేటర్ దొలుపల్లి ఏడుకొండలు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వార్డుల అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అష్టలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం



లక్ష్మీనారాయణుల కల్యాణ మూర్తులు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయ 14వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షిక వేడుకలతో పాటు అక్షయ తృతీయ నేపథ్యంలో ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున 5.30గంటలకు సుప్రభాత సేవ, అర్చనల అనంతరం 6.30 గంటలకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, మండలారాధన, 11.30 శ్రీ లక్ష్మీ నారాయణ హోమం, సాయంత్రం 5.30 గంటలకు గరుడ, శేషవాహన సేవలు నిర్వహించారు సాయంత్రం 6.30 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణుల కల్యాణ మహోత్సవం, రాత్రి 9 గంటలకు ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కిశోర బాలలకు వేసవి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఏపీఎం సాయి రమేష్

పద్మనాభం: కిశోర బాలురు, బాలికలకు వేసవి తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని వెలుగు ఏపీఎం జి.సాయి రమేష్ అన్నారు. కిశోర వికాసంపై మహిళా పోలీసులు, వీవోలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో వారంలో రెండు రోజులు కిశోర బాలురు, బాలికలకు బాల్య వివాహాల వల్ల అనర్థాలు, బాలలకున్న హక్కులు, శారీరక వ్యాయామం, ఆరోగ్యం, లింగ వివక్ష వంటి విషయాలపై తెలియజేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పురుషులకు 21, స్త్రీలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయకూడదన్నారు. లింగ వివక్ష చూపకూడదన్నారు. మగపిల్లలతో పాటు ఆడపిల్లలను కూడా చదివించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిత పాల్గొన్నారు.

పాలిసెట్‌కు 94.58 శాతం హాజరు



భీమిలి సెడార్ పరీక్ష కేంద్రం వద్ద హాజరైన విద్యార్థులు

తగరపువలస: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్–2025 బుధవారం ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులకు భీమిలిలో ఆరు పరీక్ష కేంద్రాలు కేటాయించగా 94.58 శాతం అభ్యర్థులు అనగా 1086 మంది హాజరయ్యారు. భీమిలి టౌన్‌తో పాటు దొరతోట రోడ్డులోని సెడార్, శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష జరిగింది. ఉదయం 10 గంటలకే ఆయా సెంటర్లకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. వాతావరణం చల్లగా ఉండటంతో తమ చిన్నారుల వెంట వచ్చిన తల్లిదండ్రులు ఆయా సెంటర్ల ముందే కాలక్షేపం చేశారు. పరీక్ష కేంద్రాలకు జీవీఎంసీ తాగునీటి సరఫరా చేసింది. భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ, అకడమిక్ డిప్యూటీ డైరెక్టర్ కె.విజయ భాస్కర్, జిల్లా పరిశీలకుడు పీఎం బాషా, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ జి.రాజేశ్వరి తదితరులు పరీక్షలను పర్యవేక్షించారు.

అకాల వర్షంతో అవస్థలు

- తడిసిన మొక్కజొన్న, రాగులు
- ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ వైర్లు
- ఎక్కడికక్కడ నిలిచిన నీరు



కృష్ణాపురంలో వర్షానికి తడిసిన మొక్కజొన్నలు



ఆనందపురం మండలం వెల్లంకి హైవే వద్ద సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీరు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో కోసి పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న వెన్నులతో పాటు చోడి (రాగి)చేను తడిసిపోయింది. కృష్ణాపురం, మద్ది, పాండ్రంగి, కురపల్లి, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో కోసిన మొక్కజొన్న వెన్నులు, చోడి చేను తడిసిపోయాయి. తడవడం వల్ల మొక్కజొన్నలు, రాగులు బూజు పట్టి నల్లగా మారే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేడో రేపో మొక్కజొన్న, చోడి వెన్నుల నుంచి గింజలను వేరు చేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో వర్షం కురవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఉరుములతో కూడిన వర్షం పడటంతో భీమిలి మండల పరిధిలో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చాలా ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.



టి.నగరపాలెంలో తెగిపడిన విద్యుత్ వైర్లు

నిలిచిన నీరు

జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో పలువీధులు, ఆనందపురం మండలం వెల్లంకి జాతీయరహదారిపై బుధవారం సాయంత్రం వరకు వర్షంనీరు, బురద నిలిచిపోయింది. పారిశుధ్య సిబ్బంది శ్రమించినా పూర్తిగా బురద తొలగింపు సాధ్యపడలేదు. మండలంలో ఉప్పుగల్లీలు, అరటితోటలు, మామిడి, జీడి పంటలకు నష్టం వాటిల్లింది.

తీరంలో ఈదురు గాలులు



రుషికొండ తీరం వద్ద నిలిపివేసిన స్పీడ్ బోట్లు

కొమ్మాది: తీరంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులు వీచాయి. పెనుగాలులు, వర్షంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మంగమారిపేట, ఉప్పాడ, రుషికొండ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 4 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం కూడా వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో రుషికొండలోని టూరిజం స్పీడ్ బోట్ల నిర్వహణ నిలిపివేశారు. కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో బీచ్‌ల వద్ద లైఫ్‌గార్డులు పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.

చేపల వ్యాను బోల్తా



సాగర్‌నగర్ రోడ్డులో బోల్తాపడిన వ్యాను

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట నుంచి నగరం వైపుగా వెళ్తున్న చేపల వ్యాను సాగర్‌నగర్ అంధుల పాఠశాల సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఇక్కడ మలుపు వద్ద వ్యాను ఒక్కసారిగా అదుపు తప్పడంతో, డివైడర్‌ను ఢీ కొట్టింది. వ్యాను నడుపుతున్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఆరిలోవ ట్రాఫిక్ సీఐ కె.ఎన్.ఎస్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగివలస చెరువులో చేపల మృత్యువాత



చనిపోయి చెరువు చుట్టూ చేరిన చేపలు

తగరపువలస: సంగివలస పోలమాంబ ఆలయాన్ని ఆనుకుని ఉన్న దేవదాయశాఖ చెరువులో వేలాది చేపలు మృత్యువాత పడ్డాయి. బుధవారం ఉదయం అవి చెరువు చుట్టూ తేలుతూ కనిపించాయి. ఒక్కొక్కటి కిలో పైబడి ఉన్న చేపలే చనిపోయి ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం చెరువు బండపై ఉన్న వాకింగ్ ట్రాక్‌కు వచ్చేవారు, పార్కులో యోగా చేయడానికి వచ్చిన వృద్ధులు మృతి చెందిన చేపల నుంచి వెదజల్లే దుర్గంధంతో ఉండలేకపోయారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన వర్షానికి చెరువులో ఆక్సిజన్ అందక మృతి చెందాయా లేదా చెరువులో ఎవరైనా రసాయనాలు కలపడం వల్లనా అన్న విషయం తేలవలసి ఉంది. చెరువు చుట్టూ తేలిన చేపలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించాలని వాకర్లు, వృద్ధులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం చేపలు మృతి చెందిన నేపథ్యంలో స్థానిక, చుట్టుపక్కల మార్కెట్‌లలో ఎవరూ చేపలు కొనవద్దని సామాజిక మాధ్యమాలలో పలువురు పోస్టులు పంపించారు.

మత్స్యకారులకు మెరైన్ పోలీసుల సూచనలు



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ పోలీసులు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో రుషికొండ మెరైన్ పోలీసులు బుధవారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మత్స్యకారులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అపరిచితులు తీరంలో సంచరించినప్పుడు తమకు గాని, సమీప పోలీస్ స్టేషన్‌లో గాని సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు, సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



పిల్లలకు ప్రశంస పత్రాలను అందిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి ఆధ్వర్యంలో వారం రోజులుగా పిల్లలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జీరావు మాట్లాడుతూ ఇటువంటి శిబిరాల వల్ల పిల్లలకు మంచి ప్రవర్తన, విలువలు తెలుస్తాయన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలకు ఇవి ఎంతో అవసరమని, ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన కళాసాహితిని అభినందించారు. ప్రవచనకర్త రామకృష్ణానంద మాట్లాడుతూ విద్యార్థులకు నిపుణుల ద్వారా ఎన్నో మంచి విషయాలు తెలియజేశారన్నారు. కళాసాహితి అధ్యక్షుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ పిల్లలకు ఉపయోగపడే కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాసాహితి గౌరవ అధ్యక్షుడు రేలంగి పెదబాబు, ప్రతినిధులు ఎం.కోటయ్య, అడిదం కిశోర్, కాళ్ల సన్నీ, ముసునూరి శ్రీనివాస్, పోలిపల్లి శ్రీను జోగారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం 33/11 కేవీ ఎస్ఆర్ పురం సబ్‌స్టేషన్, 11 కేవీ అడవివరం ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా దబ్బంద, ఎన్‌జీఆర్ పురం హౌసింగ్ కాలనీ, ఏపీ టిడ్కో ప్రాంత గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కరెంట్ పోతే సిగ్నల్ కట్

రెడ్డిపల్లిలో తరచూ బీఎస్ఎన్ఎల్ మూగనోము

తగరపువలస: పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో బీఎస్ఎన్ఎల్ తరచూ మూగనోము పడుతోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రతీసారి బీఎస్ఎన్ఎల్ సేవల్లో అంతరాయం ఏర్పడుతోంది. ఇటీవలే ఈ గ్రామంలో 4జీ సేవలు ప్రారంభమయ్యాయి.విద్యుత్ సరఫరా ఉన్నంతసేపు బీఎస్ఎన్ఎల్ సేవలు బాగానే ఉంటున్నా, కరెంట్ పోగానే సేవలు నిలిచిపోవడంతో ఎప్పుడు ఫోన్ కట్ అయిపోతుందో అర్థం గాక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన చాలాసేపటికి మళ్లీ బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రారంభమవుతున్నాయని, ఈ అసౌకర్యాన్ని సరిచేయాలని రెడ్డిపల్లి వాసులు కోరుతున్నారు.